క్లుప్తంగా

మోషేన్‌రాజుకు నేతల ఉగాది శుభాకాంక్షలు


మోషేన్‌రాజుకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భీమవరం: శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఆకాంక్షించారు. ఉగాది పండుగ సందర్భంగా పలువురు నాయకులు మోషేన్‌రాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోడే యుగంధర్, గాదిరాజు రామరాజు, ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, పేరిచర్ల నర్సింహరాజు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం


చండీ హోమంలో పాల్గొన్న దంపతులు

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద మహాచండీ, దుర్గా సహిత రుద్ర హోమం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. 22 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ 6వ వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. దేశం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని హోమం నిర్వహించినట్లు అర్చకులు గూడూరు నాని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. 31వ తేదీన అఖండ అన్నసమారాధన నిర్వహిస్తారని తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన కంటైనర్


కంటైనర్ లాగుతున్న క్రేన్

భీమవరం: స్థానిక విస్సాకోడేరు వంతెన సమీపంలో కంటైనర్ అదుపు తప్పి పక్కనున్న డ్రెయిన్‌లోకి దూసుకెళ్లింది. పౌర సరఫరాల శాఖ గోదాముల వద్ద జరిగిన ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. నిత్యం వాహన రద్దీతో ఉండే జాతీయ రహదారిపై ఆదివారం కావడం, ఉగాది సందర్భంగా అంతగా రద్దీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. క్రేన్ సహాయంతో కంటైనర్‌ను బయటకు తీశారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బుద్ధరాజును సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

పాలకొల్లు సెంట్రల్: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ సభ్యులు బుద్ధరాజు తెలిపారు. శనివారం రాత్రి 50 మంది పేద ముస్లింలకు నిత్యావసరల కిట్స్, దుప్పట్లు అందజేశారు. బుద్ధరాజు మాట్లాడుతూ ఫౌండేషన్ అధినేత మంతెన వెంకట రామరాజు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని తెలిపారు. రంజాన్ పురస్కరించుకుని కిట్స్ అందుకున్న ముస్లింలు ఎంవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు రాజు, పి.సూర్యనారాయణ రాజు, పెన్మెత్స రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్టేరులో చలివేంద్రం ప్రారంభం

పెనుమంట్ర: మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బస్‌స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం పెనుమంట్ర ఎస్సై కె.స్వామి ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై అన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు కేకేఆర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రోజుకు ఒక దాత చొప్పున 75 రోజుల పాటు ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గుడిమెట్ల లక్ష్మారెడ్డి, నెగ్గిపూడి మాజీ సర్పంచ్‌లు అల్లం భాస్కరరెడ్డి, కర్రి అచ్యుత రామారెడ్డి, జిల్లా కార్యదర్శి తాడి భీమారెడ్డి, అజయ్‌రెడ్డి, చింతా ధర్మవేరా, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు కొవ్వొత్తుల ర్యాలీ

పెనుగొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్టేరులో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆచంట నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్ అసోషియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డేవిడ్ రాజు, తిమోతిరాజు ఆదివారం తెలిపారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాలు, మహిళా సమైక్య ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందని, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రహదారి నిర్మాణం ఎప్పుడో ?


అధ్వానంగా ఉన్న భీమవరం–తాడేపల్లిగూడెం రహదారి


రివిట్‌మెంట్ లేకపోవడంతో కాలువ కోతకు గురైన రహదారి

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

ఉండి: తాడేపల్లిగూడెం–భీమవరం రోడ్డు మండల శివారు ప్రాంతంలో అధ్వానంగా మారింది. సుమారు 3 కిలో మీటర్ల మేర పెద్ద పెద్ద గుంతలు, రోడ్డు తెగిపోవడం, పక్కనే ఉన్న పంట కాలువలోకి జారిపోవడం వంటివి చోటు చేసుకుని రోడ్డు మరింత దారుణంగా మారింది. భీమవరం నుంచి యండగండి వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టడంతో రోడ్డు అద్భుతంగా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలల కావస్తున్నా 3 కిలోమీటర్ల రోడ్డు కనీసం ప్యాచ్ వర్క్ చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా యండగండి సెంటర్ నుంచి మండల శివారు గ్రామం ఉణుదుర్రు దాని శివారు సాగుపాడు గ్రామ పరిధిలో రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తుంది.

నిత్యం రద్దీగా రహదారి

నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. రోడ్డుకు అనుకుని ఉండి కాలువ ఉండటం కూడా రోడ్డు దుస్థితికి ఒక కారణం. అయితే అధికారుల నిర్లక్ష్యం కూడా కొంతమేర ఉందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిత్యం భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, స్కూలు బస్సులు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. ఏదైనా ప్రమాదం జరిగితే పక్కనేవున్న ఉండి కాలువలో పడిపోవడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలో అధ్వానంగా మారిన రోడ్డును వెంటనే నిర్మాణం చేపట్టి వాహనదారులు, ప్రయాణికుల కష్టాలను తీర్చాలను పలువురు వేడుకుంటున్నారు. గత ప్రభుత్వంలో రోడ్ల గురించి మాట్లాడిన నాయకులు ప్రస్తుతం అధ్వానంగా ఉన్న తాడేపల్లిగూడెం–భీమవరం రాష్ట్ర రహదారి కనిపించడం లేదా అని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు కోతకు గురైంది



యండగండి నుంచి ఉణుదుర్రు వైపుగా రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంటుంది. రోడ్డు కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉంటుంది. దయచేసి రోడ్డు రిపేరు చేయాలని అధికారులను కోరుతున్నాను.
– వెలగపల్లి టోనీ, ప్రయాణికుడు యండగండి

పందెం రాయుళ్ల అరెస్టు

కాళ్ల: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ల ఎస్సై తెలిపారు. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,100 నగదు, కోడిపుంజు, కోడి కత్తి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

పోలీసుల అదుపులో నిందితుడు

భీమవరం: ఇల్లు అద్దెకు కావాలని వెళ్లి దాడి చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. భీమవరం ఒకటో పట్టణం అమ్మిరాజు తోటకు చెందిన యర్రంశెట్టి మంగతాయారు దగ్గరకు ఈ నెల 28న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఇల్లు అద్దెకు కావాలన్నాడు. కొద్దిసేపటి తరువాత ఆమెపై చాకుతో దాడి చేసి మెడలోని బంగారు ఆభరణాలను లాక్కెళ్లాడు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దొంగతనం చేసిన వ్యక్తి బంగారు ఆభరణాలను పట్టణంలోని రెండు చోట్ల తాకట్టు పెట్టాడనే సమాచారంతో పోలీసులు ఆదివారం వెళ్లి వివరాలు సేకరించారు.

కూటమి ప్రభుత్వం విశ్వాసం కోల్పోయింది


తిర్రే బాబూరావు

నరసాపురం: కూటమి సర్కారు తక్కువ సమయంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు తిర్రే బాబూరావు పేర్కొన్నారు. పార్టీ పెన్షనర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కల్లో ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని అన్నారు. వైఎస్సార్ సీపీ అహర్నిశలు చేసిన అనేక సంక్షేమ పథకాలు అటకెక్కాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

బోస్‌కు కళారత్న పురస్కారం

భీమవరం: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక మండలి కలిసి ఘనంగా నిర్వహించారు. పలు రంగాల్లో కృషి చేసిన కళాకారులకు కళారత్న, ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

తెన్నేటి మాస్టారుకు సాహితీ పురస్కారం

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు మాస్టారు, మన వంశం కథామిత్ర, అక్షర కిరీటి తెన్నేటి మాస్టారుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉగాది సాహితీ పురస్కారం లభించింది. శ్రీవిశ్వావసు ఉగాది సందర్భంగా ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో తెన్నేటి మాస్టారు శ్రీవిశ్వావసు ఉగాది సాహితీ పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రుల చేతుల మీదుగా అందుకున్నారు.

పంచాయతీకి వాటర్ ట్యాంక్ బహూకరణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంతెన బాబు

పాలకోడేరు: కోరుకొల్లు గ్రామ అభివృద్ధికి తన తండ్రి ఆశయాల మేరకు ఆయన పేరున మంతెన వెంకట ప్రహ్లాదరాజు ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగేంద్ర కుమార్‌బాబు అన్నారు. ఉగాది పర్వదిన సందర్భంగా కోరుకొల్లు నూతన సచివాలయ ప్రాంగణంలో గ్రామంలో విశేష సేవలు అందిస్తున్న మంతెన వెంకట ప్రహ్లాదరాజు చారిటబుల్ ట్రస్ట్ గ్రామ ప్రజల సౌకర్యార్థం ఉచిత మంచినీటి సరఫరాకు ట్యాంకర్‌ను గ్రామ పంచాయతీకి బహూకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మంతెన యోగేంద్రకుమార్(బాబు) మాట్లాడుతూ గ్రామంలోని నీటి ఎద్దడి ప్రాంతాలకు, పాఠశాలలకు, గ్రామ ప్రజల అవసరాలకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వాటర్ ట్యాంకర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప సర్పంచ్ సీహెచ్‌ఎస్ రామాంజనేయరాజు (చంటిరాజు), మంతెన లక్ష్మీనరసింహరాజు పెదచంటి (మాజీ సర్పంచ్), పంచాయితీ కార్యదర్శి కె.సుజాత, పంచాయతీ వార్డు మెంబర్లు కె.భూలక్ష్మి, తాండ్ర ఆదినారాయణ, తదితరులు ట్రస్ట్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు పెన్మత్స భీమరాజు, రామారావు, ఎంటీ బంగార్రాజు, సన్నిధి కిరణ్, నడింపల్లి పృథ్వీరాజు, ఎం.పల్లపరాజు, పత్తి మహేష్, కేతలీ వెంకటేశ్వరరావు, మాదాసి శివరామకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

వీర పేరంటాలమ్మ జాతర ప్రారంభం


సాంస్కృతిక కళాకారులతో నిర్వాహకులు

ఉండి: మండలంలోని వెలివర్రు వీరపేరంటాలమ్మ ఆలయ 72వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గాదిరాజు వెంకటరాజు, పాత్తూరి వెంకటేశ్వరరాజు, క్లోపల్లి సతీష్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ వెంకటరాజు దంపతులచే కలశస్థాపన, ప్రసాద వితరణ నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద అమ్మవారి ప్రత్యేకతను చాటుతూ వరలక్ష్మీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటుగా కృష్ణా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనార్థం తరలి వచ్చారు.

అంగరంగ వైభవంగా ఉగాది వేడుకలు

ఉండి: మండల వ్యాప్తంగా తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో ఉండిలోని శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో కవి, సాహితీవేత్త గాదిరాజు రంగరాజుకు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రంగరాజును సత్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ తెలుగు వారి నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన ఓ ప్రముఖ వ్యక్తిని సత్కరించడం తెలుగు జాతిని గౌరవించినట్లుందని వారన్నారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, ఆళగిరి సత్యానంద్, మాసాబత్తుల రామకృష్ణ, గోపాలరాజు, రాయి సతీష్, యేడిద నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.


రంగరాజుకు ఉగాది పురస్కారాన్ని అందిస్తున్న గ్రామ ప్రముఖులు

తెలుగు వారి తొలి పండుగ ఉగాది

పాలకోడేరు: తెలుగు వారి తొలి పండుగ ఉగాదని మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గాదిరాజు సూర్యనారాయణరాజు అన్నారు. ఉమా సోమేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా ఈ ఏడాది అన్ని రాశులకు సంబంధించి వారి ఫలితాలను ప్రముఖ సిద్ధాంతి చర్ల వెంకటేశ్వర్లు ఉగాది పంచాంగ శ్రవణం చేశారు. తొలిత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో చేకూరి నరేంద్ర రాజు, బాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గొల్లలకోడేరులో పంచాంగ శ్రవణం చేస్తున్న సిద్ధాంతి చర్ల వెంకటేశ్వర్లు

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): ఉగాది పండుగను పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన ముచ్చర్ల భవాని శంకర్ దంపతులు, ఏలూరి శ్రీనివాస్ దంపతులు, వీరమల్లు శ్రీనివాసరావు దంపతులు, నైనాలశెట్టి సుబ్బారావు దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అమ్మవారికి 300 మామిడి కాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మెంటేవారి తోట వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళా సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


బాలా త్రిపుర సుందరీదేవి

పాస్టర్ ప్రవీణ్‌కు ఘన నివాళి

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతిపై తగిన న్యాయం చేయాలంటూ భీమవరంలో నిర్వహించిన శాంతి ర్యాలీకి మండలం నుంచి పాందువ్వ, ఉణుదుర్రు, ఉండి, చెరుకువాడ, యండగండి తదితర గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రైస్తవ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు జి.సుందర్ కుమార్, గొంతే హరీష్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం మరింత లోతుగా దర్యాప్తు చేసి నిజ నిర్ధారణ చేయాలన్నారు. వేలాది మంది శాంతి ర్యాలీలో పాల్గొని మాకు న్యాయం కావాలని నినాదాలు చేశారు. గత ప్రభుత్వంలో ఎవరికీ ఎటువంటి హాని జరిగినా క్షణాల్లో నిజాలు నిగ్గుతేల్చేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించేవారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాలు ప్రవీణ్ మృతిపై గొంతెత్తుతుంటే కూటమి నాయకులు మాత్రం మాకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఇది ముమ్మాటికీ హర్షించదగ్గ విషయం కాదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల క్రైస్తవ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



శాంతి ర్యాలీకి తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఘాట్‌లు ఇలా.. స్నానాలు ఎలా..?

నరసాపురం మీదుగా వశిష్ట గోదావరి ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో గోదావరిలో భక్తులు స్నానం చేసేందుకు వివిధ ఘాట్‌లను నిర్మించారు. అయితే ఆ ఘాట్‌లన్నీ ప్రస్తుతం అధ్వానంగా మారాయి. ముఖ్యంగా వరదల సమయంలో సాధారణంగా ఘాట్‌ల మెట్లపై బురద పేరుకుపోతూ ఉంటుంది. వరదల అనంతరం వాటిని శుభ్రం చేయించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో బురద పేరుకుపోయి అధ్వానంగా మారాయి. విశిష్ట రోజుల్లో గోదావరిలో స్నానం ఆచరించేందుకు వచ్చే భక్తులు అపరిశుభ్రంగా ఉన్న ఘాట్‌ల వద్దే పుణ్యస్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. నాయకులు, అధికారులు స్పందించి ఘాట్‌ల వద్ద పరిస్థితిని మెరుగు పర్చాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. – నరసాపురం


అధ్వానంగా వలంధర్‌రేవు


మట్టి పేరుకుపోయి ఉన్న కొండాలమ్మ ఘాట్

భక్తులతో ఆలయాలు కిటకిట



కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు ఫణిశర్మ, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కాళ్ల: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం, సీసలిలోని షిర్డీసాయి బాబా ఆలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామి, బాబాను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళ్లకూరులో దేవస్థానం వేద పండితుడు అనిపెద్ది ఫణిశర్మ భక్తులకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం అధికారులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

సీతారాములకు వెండి కిరీటాల సమర్పణ

పెంటపాడు: మండలంలలోని యానాలపల్లి గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన దంపతులు రూ.1.50 లక్షల విలువైన 4 వెండి కిరీటాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామంలోని రామాలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంతులకు నాలుగు వెండి కిరీటాలు అందించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. తాడి శ్రీను, తాడి లోకేంద్రతేజ్, దాసం తాతాజీ, కవల మూర్తిరాజు, తాడి సత్తిపండు, పండు, వీరాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా పుంతలో ముసలమ్మ జాతర

తణుకు అర్బన్: శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం తణుకులో కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక కుమ్మర్ల వీధిలో వేంచేసియున్న ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు ఆకుల బ్రదర్స్, మారోతి బ్రదర్స్, దూడల శ్రీను, చేశెట్ల శంకర్, బెజవాడ సూరి, చిక్కాల మోహన్, గరిమెళ్ల పవన్, గాదంశెట్టి జయకృష్ణ జాతర మహోత్సవాన్ని పర్యవేక్షించారు.

ముఖదారమ్మ జాతర ప్రారంభం


23 కాసుల బంగారు మంగళసూత్రం అలంకరణతో ముఖదారమ్మ

పాలకొల్లు సెంట్రల్: ఉగాది పర్వదినం పురస్కరించుకుని స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున కొలువైన శ్రీ ముఖధారమ్మ వారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మ వారికి భక్తుల సహకారంతో 23 కాసులతో తయారు చేయించిన బంగారు మంగళసూత్రం అలంకరించామని ఆలయ కమిటీ అధ్యక్షులు కుంపట్ల చిన్నరాజా తెలిపారు. అలాగే భక్తులు చెక్కా కృష్ణ, రోజా దంపతులు 500 గ్రాములతో అమ్మవారికి వెండి గరగ, చిల్లిముంతల జీవన్ సుబ్రహ్మణ్యం, మాధురి దంపతులు 400 గ్రాములతో ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడికి వెండి కిరీటం అందించారు. వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు పిన్ని ఉప్పరి కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంభం వేసి అనంతరం జాతర ఊరేగింపు ప్రారంభించారు. వెలిగట్ల రమేష్ మిత్రబృందం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మండెల జీజీ, కొల్లంశెట్టి చిన్ని, చిల్లిముంతల బాబి, వెలిగట్ల గణేష్, బెజవాడ మహేష్ పాల్గొన్నారు.